క్లుప్తంగా

రామ్‌రాజ్ కాటన్ షోరూం ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

హిందూపురం టౌన్: పట్టణంలోని రైల్వే రోడ్డులో రామ్ రాజ్ కాటన్ నూతన షోరూంను గురువారం ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు, ఏఆర్ హాస్పిటల్ డాక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి, డాక్టర్ సంధ్యారాణి, రామ్‌రాజ్ కాటన్ ఎస్‌జీఎం రామకృష్ణ, ప్రాజెక్ట్ హెడ్ ఏ.కన్నన్, క్లస్టర్ మేనేజర్ రాకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు రిబ్బన్ కట్ చేసి షోరూంను ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. రామ్‌రాజ్ కాటన్‌కు 300కు పైగా షోరూమ్‌లు ఉన్నాయని, హిందూపురం ప్రజలకు రామ్ రాజ్ కాటన్ దుస్తులు అందుబాటులోకి తీసుకురావడం సంతోషనీయమన్నారు. కార్యక్రమంలో రామ్‌రాజ్ కాటన్ షోరూం ప్రతినిధులు, డీలర్లు, పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి పోస్టర్ల విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో జనవరి 10వ తేదీన నిర్వహించనున్న వైకుంఠ ఏకాదశి పోస్టర్లను గురువారం అర్చకులు విడుదల చేశారు. ఏకాదశి వేడుకలపై గ్రామాల్లో ప్రచారం చేస్తామన్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లను కమిటీ సభ్యులు చేస్తున్నారని పేర్కొన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



హిందూపురం: ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సీపీఐ నాయకులు

హిందూపురం టౌన్/సోమందేపల్లి/లేపాక్షి/మడకశిర: సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవాలను హిందూపురం, సోమందేపల్లి, లేపాక్షి, మడకశిర పట్టణాల్లో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. వక్తలు మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో సీపీఐ ఏర్పాటైందన్నారు. నాటి నుంచి నేటి దాకా కార్మికులు, రైతులు, పేద ప్రజల సమస్యలపైన రాజీలేని పోరాటాలను నిర్వహించి లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర సీపీఐకి దక్కిందన్నారు.

గుట్టూరులో 'పొలం పిలుస్తోంది'



గుట్టూరులో పొలం పిలుస్తుంది నిర్వహిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఏడీ స్వయంప్రభ రాగి సాగు విస్తీర్ణం, సాగులో మెలుకవలు గురించి రైతులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చందన, సిబ్బంది అశోక్ కుమార్, భాను శ్రీ, రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ర్యాలీ



ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న విద్యార్థులు

లేపాక్షి: మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో గురువారం ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగంతో ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేస్తు గ్రామ ప్రజలను ఉత్తేజ పరిచారు. పాఠశాల నుంచి బస్టాండు వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, స్కౌట్ ఉపాధ్యాయుడు అశ్వత్థనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయమెప్పుడో ?

- కలగానే ఉపాధి అనుసంధానం
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని ప్రభుత్వాలు
- పెరిగిన ఖర్చులు, కూలీలు దొరక్క రైతుల అవస్థలు



పంటల సాగు ఇలా..

మండలం	రైతుల సంఖ్య	మొత్తం ఎకరాలు
రొళ్ల	7,248	15,299
అగళి	5,407	12,383
గుడిబండ	9,136	18,161
అమరాపురం	5,923	15,375
మడకశిర	7,544	15,730

రొళ్ల: ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానించాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉంది. ప్రభుత్వాలు ప్రకటనలు మాత్రమే చేస్తున్నాయి తప్ప అమలు మాత్రం చేయడం లేదు. కూలీలు ఎక్కువగా ఉపాధి హామీ పనులకు వెళ్తుండటంతో వ్యవసాయ పనులకు కొరత ఏర్పడుతోంది. దీంతో కూలీ రేటు పెరగడంతో పాటు, వ్యవసాయ పనులు సకాలంలో పూర్తికాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. యంత్ర పరికరాలు ఎన్ని అందుబాటులోకి వచ్చినా చాలా పనులు కూలీల ద్వారానే చేయించాల్సి ఉంటుంది. దీంతో కూలీల కొర త ఏర్పడి రైతులు అగచాట్లు పడుతున్నారు.

కూలీల కొరతతో పాటు ఖర్చులకు చెక్

2014లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఉపాధి హామీని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చి.. విస్మరించింది. ఇప్పుడు కూడా వారి ప్రభుత్వమే ఉన్నా ఆ హామీని అమలు చేసే దిశగా మాత్రం ముందు కెళ్లడం లేదు. మడకశిర నియోజకవర్గంలో రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురంతో పాటు మడకశిర మండలాల్లో 35,258 మంది రైతులు ఉన్నారు. 76,948 ఎకరాల్లో ఖరీఫ్, రబీలో వేరుశనగ, వరి, రాగి ఇతరాత్ర పంటలు సాగు చేస్తున్నారు. రైతులు వారి స్తోమతకు మించి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యవసాయంలో పెట్టుబడులు పెడుతున్నారు. దీంతో తరచూగా నష్టాలే మిగులుతున్నాయి. వరి, వేరుశనగ సాగు చేస్తున్న రైతులు విత్తనాలు చల్లడం మొదలు కోత, కుప్పలు, నూర్పిడి ఇతరాత్ర పనులకు ఎకరా పంట సాగుకు దాదాపు రూ.20 వేల నుంచి రూ.30 వేల దాక ఖర్చులు భరించాల్సి ఉంది. వ్యవసాయ రంగాన్ని ఉపాధికి అనుసంధానం చేస్తే కూలీల కొరతతో పాటు రైతులకు వ్యవసాయ సాగు ఖర్చు తగ్గుతుందని రైతులు చెబుతున్నారు.

ఉపాధికి అనుసంధానం అవసరం



ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలి. ప్రస్తుత పరిస్థితుల్లో పంట సాగు రైతులకు భారంగా మారింది. ప్రతి పంటకు రైతులు అప్పులు చేసి సాగు చేస్తున్నప్పటికీ లాభాలు మాత్రం రావడం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– తిమ్మారెడ్డి, హెచ్‌టీ హళ్లి, రొళ్ల మండలం

అప్పులపాలవుతున్నాం.. ఆదుకోండి



రైతులకు పంటల సాగు భారంగా మారింది. వ్యవసాయంపై పెట్టిన పెట్టుబడులు కూడా దక్కడం లేదు. పెట్టిన ఖర్చు రాకపోగా అప్పులపాలవుతున్నాం. ఇప్పటికై న ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి.

– రైతు గోవిందరాజు, గుడ్డగుర్కి, రొళ్ల మండలం

రైతుల కష్టాలను గుర్తించాలి



ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి ఉపాధి హామీ పథకాన్ని ఇప్పటికైనా వ్యవసాయానికి అనుసంధానం చేయాలి. దాని వల్ల రైతులతో పాటు కూలీలకు కూడా మేలు జరుగుతుంది. ప్రస్తుతం వ్యవసాయంలో పెట్టుబడులు కూడా దక్కకపోవడంతో నష్టాల్లో కూరుకుపోతున్నాం.

– రవికుమార్, బీజీ హళ్లి, రొళ్ల మండలం

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



అలంకరణలో వినాయకుడు

అమరాపురం: మండల పరిధిలోని బంగారు పాళ్యం గ్రామానికి వెళ్లే రహదారిలో వెలసిన బెనవన్న స్వామి ఆలయ ఆవరణలో గురువారం తెల్లవారు జామున నుంచి శాంతి, వాస్తు, గణపతి, నవగ్రహ హోమాలను అర్చకులు అశ్వర్థ నారాయణస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి విగ్రహానికి వివిధ రకాల అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో గొడనకుంట, ఉదుగూరు గుడికట్టుకు చెందిన సోమేనహళ్లి జానకల్లు గోత్రానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

సైకిల్ స్టాండ్ నిర్వహణకు టెండర్ల ఆహ్వానం

హిందూపురం టౌన్: హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో సైకిల్ స్టాండ్ నిర్వహణకు సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న పేర్కొన్నారు. సంవత్సర కాలానికి సైకిల్ స్టాండ్ కాంట్రాక్ట్ ఇస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం నెల బాడుగ రూ.31,065గా నిర్ణయించామన్నారు. ఆస్పత్రిలోని కార్యాలయంలో టెండర్ ఫారం పొందవచ్చన్నారు. సీల్డ్ టెండర్‌ను ఈ నెల 31న మధ్యాహ్నం 2 గంటలకు మూసివేస్తామని, 3 గంటలకు తెరుస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఆస్పత్రిలో సంప్రదించాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

అగళి: మండల పరిధిలోని బొమ్మరసనపల్లి శివారులో పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ వీరేష్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7,100 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



తహసీల్దార్‌కు భూ సమస్యలపై అర్జీలు ఇస్తున్న రైతులు

మడకశిరరూరల్: మండలంలో భూ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ కరుణాకర్ తెలిపారు. గురువారం గొడనహళ్లి గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పుట్టమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: భూ సమస్యలు ఏమైన ఉంటే రెవెన్యూ సదస్సు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి రైతులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని బీజీ హళ్లిలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ గిరియప్ప, వీఆర్వో గిరిష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: మండల పరిధిలోని జంబులబండలో గురువారం రెవిన్యూ సదస్సు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ కల్యాణ్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసమే రెవిన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



హిందూపురం: పూజలో పాల్గొన్న భక్తులు

గోరంట్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు పక్కన ఉన్న సన్నిధానంలో గురువారం అయ్యప్పస్వామి పడిపూజను ఘనంగా నిర్వహించారు. వందలాది మంది మాలధారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్: హిందూపురం మండలం కిరికెరలోని మణికంఠ అయ్యప్పస్వామి దేవాలయంలో గురువారం మండల మహోత్సవ పూజా కార్యక్రమం వైభవంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ నేత కొండూరు వేణుగోపాల్‌రెడ్డి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

బెంగళూరు రోడ్డులో..

బెంగళూరు రోడ్డులో వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలో మండల పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డీఎస్పీ మహేష్ తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సిలిండర్ పేలి గుడిసె దగ్ధం



ప్రమాదంలో కాలి బూడిదైన గుడిసె

పావగడ: తాలూకాలోని సీకే పుర గ్రామ పంచాయతీకి చెందిన హరి హర పుర గ్రామంలో సిలిండర్ పేలి గుడిసె పూర్తిగా దగ్ధమైన ఘటన గ్రామంలోని దళితవాడలో ఈ ఘటన చోటు చేసుకుంది. వృద్ధ దంపతులు దొడ్డణ్ణ, భూతమ్మ, విద్యార్థిని తిప్పమ్మ వివరాల మేరకు.. బుధవారం సాయంత్రం వంట చేయడానికి ఉపక్రమిస్తుండగా సిలిండర్ పేలిందని, తాము బయటకు పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నామన్నారు. గుడిసె మొత్తం కాలిపోయిందని, అందులో ఉన్న సామగ్రి, నిత్యావసరాలు, సరిఫికెట్లు, దుస్తులు, రూ.50 వేల నగదు కూడా అగ్గిపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ వరదరాజు, ఆర్‌ఐ రామలింగప్ప సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నష్ట పరిహారం చెల్లించి తమను ఆదుకోవాలని తహసీల్దార్‌కు బాధితులు విన్నవించారు.

మోడల్ పేపర్ల పంపిణీ

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచితంగా మోడల్ పేపర్లు పంపిణీ చేశారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించినడానికి ఈ మోడల్ పేపర్లు ఉపయోగపడతాయన్నారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సానిపల్లి గంగాధర్, పోతులయ్య, నరసింహులు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

మడకశిరరూరల్: మండల పరిధిలోని కల్లుమర్రి గ్రామంలో భక్త కనకదాసు విగ్రహం ఏర్పాటుకు గురువారం కురుబ సంఘం నాయకులు భూమి పూజ చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి విగ్రహం ఏర్పాటు చేస్తామని నాయకులు తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట

- పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్



రొళ్లలో పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్టీ శ్రేణులు

మడకశిర: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల బాదుడుకు నిరసనగా మాజీ ముఖ్యమంత్రి , వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మడకశిరలో తలపెట్టిన పోరుబాట నిరసన ర్యాలీ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, అభిమానులు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి ఇంటి వద్ద నుంచి విద్యుత్‌శాఖ డీఈ కార్యాలయం దాకా ర్యాలీ కొనసాగుతుందన్నారు.

అగళి: మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి పోరుబాట కార్యక్రమం పోస్టర్లను వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప గురువారం ఆవిష్కరించారు. ఈరలక్కప్ప మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు అందుకు భిన్నంగా చార్జీలను పెంచి ప్రజలపై పెనుభారం మోపడం దారుణమన్నారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ చేపట్టిన పోరుబాటకు తరలిరావాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మహేంద్రప్ప, కో ఆప్షన్ సభ్యుడు నాసిర్ , సర్పంచ్ భర్త హనుమంతరాయప్ప, నాయకులు లింగరాజు, హేమంతరాజు, నారాయణ, అక్లీమ్, గోవిందప్ప, గంటా నాగరాజు, తిమ్మరాయప్ప, రామచంద్రప్ప, జయచంద్ర, కృష్ణప్ప, శివన్న తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: విద్యుత్ చార్జీల పెంపకాన్ని నిరసిస్తూ మడకశిరలో శుక్రవారం చేపట్టిన పోరుబాట పోస్టర్లను మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప విడుదల చేశారు. వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోకపోతే ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని ఈరలక్కప్ప హెచ్చరించారు. పోరుబాటను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలన్నారు.

హిందూపురం టౌన్: విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ చేపట్టిన పోరుబాటను విజయవంతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ రాము, జేసీఎస్ కన్వీనర్ గిరి, సర్పంచ్ దేవరాజులు పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని సంతేబిదనూరులో పోరుబాట పోస్టర్లను విడుదల చేశారు. శుక్రవారం జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామాంజి, దేవరాజు, అబ్బు, మన్సూర్, హయత్, ప్యారు, తిమప్పలు పాల్గొన్నారు.



హిందూపురం: పోరుబాట పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు



అమరాపురం: పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అమరాపురం: విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా మడకశిరలో శుక్రవారం నిర్వహించే నిరసన కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, ఎంపీపీ ఈరన్న, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీరక్యాతరాయప్ప, ఎంపీటీసీ సభ్యుడు నారాయణ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే గురువారం మండల కేంద్రంలో పోరుబాట పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో రామమూర్తి, గాదీరప్ప, శివకుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

పోరుబాటను విజయవంతం చేయండి

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక



హిందూపురం టౌన్: కూటమి ప్రభుత్వ నిరంకుశ, దోపిడీ ధోరణిని ఎండగట్టేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్త, ప్రజలు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్న పోరుబాట కార్యక్రమాన్ని హిందూపురం నియోజకవర్గంలోని పట్టణ, మండల, లేపాక్షి, చిలమత్తూరు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి పేద, మధ్యతరగతి ప్రజలను నట్టేట ముంచిందన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం నేడు మాట మార్చి, విద్యుత్‌చార్జీల భారం మోపిందని, దీనిపై నిరసన గళం ప్రభుత్వానికి తాకేలా ప్రతి ఒక్కరూ గల మెత్తి ఎండగట్టాలని అన్నారు.

సంఘాలను బలోపేతం చేయండి

రొళ్ల: గ్రామాల్లో మహిళా పొదుపు సంఘాలను యానిమేటర్లు, వీఓ లీడర్లు బలోపేతం చేయడానికి కృషి చేయాలని ఇన్‌చార్జ్ వెలుగు ఏపీ నాగరాజు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణలో యానిమేటర్లు, వీఓ లీడర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ వెలుగు ఏపీ పలు సూచనలు చేశారు.

ప్రచార జాతాను విజయవంతం చేయండి

మడకశిర: నియోజకవర్గంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ ప్రచార జాతాను విజయవంతం చేయాలని జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న కోరారు. గురువారం పట్టణంలోని కేపీ ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ పదాధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2025 జనవరి 5,6,7,8వ తేదీల్లో కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు జరుగుతాయన్నారు.ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రచార జాతాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో శుక్రవారం ఉదయం 8.30 గంటలకు జెండా ఊపి ప్రారంభించనున్నట్లు తెలిపారు.



మడకశిర నుంచి పెనుకొండ వెళ్లే రోడ్డును కప్పేసిన పొగమంచు

మంచు కురిసే వేళలో..

మడకశిరరూరల్: మడకశిర ప్రాంతంలో ఉదయం 8 గంటల వరకూ పొగ మంచు కప్పేస్తోంది. దీంతో రోడ్లు కనిపించక వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పనులకు వెళ్లే వారు కూడా అవస్థలు పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు ఉదయం 9 వరకూ బయటకు రాలేని పరిస్థితి.



ఆర్ అనంతపురం వద్ద పొలంలో చలిమంట వేసుకున్న రైతులు